క్లుప్తంగా

జాతర నిర్వహణకు ఎమ్మెల్యే విరాళం


గ్రామస్తులకు నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని ఈస్టుపేటలో వెలసిన శ్రీ నల్లగంగమ్మ జాతర నిర్వహణకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి రూ.10 వేలు విరాళం అందించారు. శనివారం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు నగదును గ్రామస్తులకు అందజేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కరీమ్, మండల కో ఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, నాయకులు రామమూర్తి, బాలకృష్ణారెడ్డి, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

11వ రోజుకు మున్సిపల్ దీక్షలు


దీక్ష చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మదనపల్లె : స్థానిక మున్సిపల్ కార్యాలయం ఇంజినీరింగ్ విభాగం కార్మికుల దీక్షలు శనివారం కొనసాగాయి. తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన దీక్షలు 11వ రోజుకు చేరాయి. సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు, సాంకేతిక సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి 24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆప్కాస్ పరిధిలోని నాన్ పీహెచ్ కార్మికులను ఇంజనీరింగ్ విభాగ కార్మికులుగా నమోదు చేయాలని, తమ డిమాండ్లు తీర్చాలంటూ కార్మికులు నినాదాలు చేశారు. దీక్షలో ఎస్‌కే.రెడ్డెప్ప, నాగరాజు, కన్నయ్య, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి

తంబళ్లపల్లె : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని నూతన ఎస్‌ఐ ఉమమహేశ్వరరెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పూర్తిగా అడ్డుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.ఎవరికి ఎలాంటి సమస్య ఏర్పడినా నేరుగా పోలీసుస్టేషన్‌కు వచ్చి తెలియజేయాలన్నారు. వాటిని పరిశీలించి తగిన న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

వృక్షానికి గబ్బిలాల తోరణం


చెట్టు ఆకులపై వేలాడుతున్న గబ్బిలాలు

మదనపల్లె సిటీ : ఈ చిత్రంలో చెట్టు కొమ్మలకు నల్లని ఆకులు ఉన్నట్లు కన్పిస్తున్నవి గబ్బిలాలు. మదనపల్లె మండలం గుట్టమీదపల్లెకు వెళ్లే దారిలో ఉన్న ఓ చెట్టుకు ఇలా వేలాడుతూ కనిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ పెద్ద మర్రి చెట్టు ఉండేదని, వందల సంఖ్యలో గబ్బిలాలు అవాసంగా మార్చుకోవడంతో ఈ ప్రాంతానికి గబ్బిలాల మర్రి అని పేరు వచ్చింది. కాలక్రమేణ మర్రిచెట్టు కనుమరుగు కావడంతో గబ్బిలాలు మాత్రం అక్కడే ఉన్న మరో చెట్టుపై అవాసం ఏర్పాటు చేసుకున్నాయి. వీటిని స్థానికులు ఆసక్తిగా చూస్తున్నారు.

నియామకం


డాక్టర్ పీవీఎస్ లక్ష్మి

పీలేరు : ఇంటర్‌నేషనల్ న్యాచురోపతి ఆర్గనైజేషన్(ఐఎన్‌ఓ), సూర్యఫౌండేషన్ వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో కన్వీనర్‌గా పీలేరుకు చెందిన డాక్టర్ పీవీఎస్ లక్ష్మిని శనివారం నియమించారు. అనేక సంవత్సరాలుగా యోగా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఆమెను గుర్తించి ఎంపిక చేశారు. కరోనా సమయంలో కూడ దాదాపు 2 లక్షల మందికి ఆన్‌లైన్ పద్ధతిలో శిక్షణ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా పీవీఎస్ లక్ష్మి మాట్లాడుతూ 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తనకు ఈ పదవి ఇచ్చారని తెలిపారు.

పది లీటర్లు సారా స్వాధీనం

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండలంలోని వైకోట-ఓబులవారిపల్లి చెన్నరాజుపోడు క్రాస్ వద్ద నాటుసారా తరలిస్తున్న పాలంకోట లక్ష్మమ్మను అరెస్టు చేసి పదిలీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐ తులసి శనివారం తెలిపారు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

సూరయ్యగారికుంట చెరువు కబ్జా

ఆక్రమించినట్టు నిర్ధారించిన అధికారులు


చెరువులో నింపిన రాళ్లు, మట్టి


చెరువులో వేసిన రోడ్డు

మదనపల్లె : మదనపల్లె రూరల్ మండలం వెంకప్పకోట, పోతబోలు గ్రామాల పరిధికి చెందిన సూరయ్యగారికుంట చెరువును జబ్బల శ్రీనివాసులు ఆక్రమించారని శిద్దమ్మగారిపల్లెకు చెందిన రైతులు ఫిర్యాదు చేయడంతో అధికారులు గురు, శుక్రవారాల్లో పరిశీలన జరిపారు. చెరువు వద్ద భారీగా చేపట్టిన నిర్మాణలు చెరువులోకి వచ్చాయని, సర్వే జరిపి ఆక్రమణలు తొలగించాలని రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం సచివాలయ సర్వేయర్లు సర్వే నిర్వహించారు. శుక్రవారం తహసీల్దార్ కే.కిశోర్‌కుమార్‌రెడ్డి చెరువువద్ద సర్వేయర్లు నిర్ధారించిన సర్వే, వాటి రికార్డులను పరిశీలించారు. ఇందులో ఒకటిన్నర సెంటులో అక్రమ నిర్మాణాలు, ఇదికాకుండా సమాధులు ఉన్నట్టు గుర్తించామని తహసీల్దార్ చెప్పారు. వీటిని తొలగించాలని ఆదేశించామని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్టు పేర్కొన్నారు. కాగా చేపట్టిన నిర్మాణాలను పరిశీలిస్తే కాంపౌండ్ వాల్ పనులు చెరువు మొరవ దాటుకుని, కట్టలో పలికి వచ్చి పనులు చేస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో ఆక్రమణ చేసినట్టుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే కాంపౌండ్‌వాల్ పక్కనే చెరువులో క్వారీ రాళ్లు, మట్టిని టిప్పర్లతో తరలించి నింపేస్తున్నారు. భవిష్యత్తులో చెరువును మట్టితో నింపేసి నీటి నిల్వ సామర్థ్యం తగ్గించడమే కాకుండా ఈ చెరువు భాగాన్ని కలుపుకునే అవకాశం ఉంది. దీంతోపాటు నిర్మాణం చేపట్టిన భూమిలోకి రాకపోకలు సాగించేందుకు చెరువులో రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. ఈ రోడ్డుపక్కనే చదునైన మంచి భూమి ఉంది. ఇదంతా చెరువు భూమి అని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఈ భూమిలోని ఆక్రమిత నిర్మాణాలు, అందులో వేసుకున్న యంత్ర సామగ్రిని ఖాళీ చేయించని పక్షంలో కోట్ల విలువైన ఈ భూమి మొత్తాన్ని కలిపేసుకునే ప్రమాదం ఉంది. కాగా చెరువులో వేసిన మట్టి, రాళ్లు, షెడ్డు నిర్మాణాలను తొలగించాలని ఆక్రమణదారులను ఆదేశించినట్టు తహసీల్దార్ కిశోర్‌కుమార్ రెడ్డి చెప్పారు.

నీటి అధికారులు ఎక్కడ

సూరయ్యగారికుంట చెరువు ఆక్రమణ వ్యవహారంపై జలవనరులశాఖ అధికారులు ఏం చర్యలు తీసుకున్నారో తెలియడం లేదు. కనీసం తమ శాఖకు చెందిన చెరువు ఆక్రమణపై కనీసం స్పందించినట్టుగా లేదు. జలవనరులశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి చెరువు ఏ మేరకు ఆక్రమణకు గురైంది, చెరువు విస్తీర్ణం ఎంత, నీటినిల్వ వైశాల్యం ఎంత, కట్ట పోడవు, మొరవ వైశాల్యంపై రికార్డులతో రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలిస్తే చెరువు పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

రక్తదానం ప్రాణదానంతో సమానం


గుర్రంకొండలో రక్తదానం చేస్తున్న దాతలు


పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పీలేరు : రక్తదానం ప్రాణదానంతో సమామని డాక్టర్ నాగవేణి అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పీలేరు ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ పీలేరు, రేగళ్ళు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరులో రక్తదాన శిబిరాల ద్వారా 9,850 మంది నుంచి రక్తం ఉచితంగా సేకరించి అవసరమైన వారికి అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రక్తనిల్వలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అవసరమైన వారికి దాతలు వెంటనే అందించాలని కోరారు. రక్తం దానం చేయడం వలన ఎలాంటి అనారోగ్య పరిస్థితి రాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గుర్రంకొండ : గుర్రంకొండలో మదనపల్లె హెల్పింగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రక్తంలోని రకాలు కనుగొన్న కార్ల్ ల్యాండ్ స్టినేర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ శిబిరంలో 52 మంది పాల్గొని రక్తాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకులు అబూబక్కర్ సిద్దీఖ్ మాట్లాడుతూ మన శరీరంలో జీవధారగా ప్రవహించే రక్తం మరొకరి నిండు ప్రాణాలను నిలబెడు తుందన్నారు. అనంతరం ఆ సంస్థ గుర్రంకొండ ఇన్‌చార్జ్‌లు మొఖద్దర్, ఆబీద్‌లను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ జమీర్, సంస్థ మదనపల్లె వలంటరీ బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ బాలచంద్ర, కృష్ణ, సంస్థ సభ్యులు యతీష్, మొహమ్మద్, ముష్రాఫ్, కిరణ్, సాంబ, జయేంద్ర, సాయి మిధున్‌లు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు


తరిగొండలో స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లోని మూలమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ గావించారు. ఈ సందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయంలో వేకువజామున అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను దర్శించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ఆందోళన


ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మదనపల్లె : మున్సిపల్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని కోరుతూ శనివారం మదనపల్లెలో మున్సిపల్ కార్మికుల సంఘం ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సాంబశివ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మస్తాన్ మాట్లాడుతూ రాష్ట్రంలో 48వేల మంది కార్మికులు మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో పని చేస్తున్నారని అన్నారు. వీరికి తల్లికి వందనం పథకం వర్తించకపోవడంతో నష్టపోతున్నారని అన్నారు. చిరుద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పథకం వర్తింపజేయడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఏఐటీయూసీ, ఏఐఎస్‌ఎఫ్, సీపీఐ నాయకులు ముబారక్, చలపతి నాయుడు, తిరుమల, దేవా, వాసు, శ్రీనివాసులు, ఇంద్రాణీ, జానకి, రాధ, నరసింహులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్‌ఎం సేవలు మరువలేనివి

పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


శిరోమణి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం కొత్తపేట వీధికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శిరోమణి సేవలు మరువలేనివని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆమె మరణించిన సమాచారంతో శనివారం ఉదయం వారి స్వగృహానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చింతల ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె వాల్మీకిపురం బాలికోన్నత పాఠశాలలో సుదీర్ఘంగా పని చేసి, ఎందరో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దారని గుర్తుచేసుకున్నారు. ఆమె భర్త విశ్రాంత ఎంఈఓ జాకబ్, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. నివాళులు అర్పించిన వారిలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతల శివానందరెడ్డి, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, శ్రీధర్ రాయల్, గాంధీపేట రఘు, ప్రభుచరణ్, ప్రభు కిరణ్, శ్యామ్‌సుందర్ తదితరులు ఉన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం


క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారులు

సుండుపల్లె : క్షయ వ్యాధిపై సామాజిక అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రాయవరం పీహెచ్‌సీలో టీబీ ముక్త అభియాన్‌లో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటువ్యాధి అని, వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా గాలిలో కలిసి ఇతరులకు వ్యాపిస్తుందని తెలిపారు. ఛాతిలో నొప్పి రావడం, రెండు వారాల పైబడి దగ్గు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, తగ్గినప్పుడు గళ్లతో పాటు రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలన్నారు. జబ్బు నిర్ధారణ అయితే ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా మందులను పంపిణీ చేస్తామని తెలిపారు. క్షయ వ్యాధి ఊపిరితిత్తులకు కాకుండా శరీర ఇతర భాగాలకు కూడా వచ్చే అవకాశం ఉందని దీనిని ఎక్స్‌రే ద్వారా నిర్ధారణ చేయవచ్చని తెలిపారు. ఆరు నెలలు మందులు వాడితే ఈ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని ఆయన తెలిపారు.

కార్మికుల పిల్లలకు తల్లికి వందనం వర్తింపచేయాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ వర్కర్స్

మదనపల్లె రూరల్ : రాష్ట్రంలోని మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలందరికీ తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) నాయకులు రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ వర్కర్స్‌తో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ...రాష్ట్రంలోని 48వేల మంది మున్సిపల్, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం నిధులు జమకాకపోవడం తీవ్ర అసంతృప్తికి గురిచేసిందన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. మున్సిపల్, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులతో పాటుగా స్కీమ్ వర్కర్స్‌కు తల్లికి వందనంతో పాటు ఇతర సంక్షేమ పథకాలను వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సంక్షేమ పథకాలు మున్సిపల్ కార్మికుల కుటుంబసభ్యులకు వర్తింపజేయకపోతే, రానున్న రోజుల్లో ఆందోళన పోరాటాలను నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మీదేవి, మంజుల, శివమ్మ, కొండమ్మ, శంకరప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల పేరుతో తల్లికి వందనంలో కోత

సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె రూరల్ : ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లుగా తల్లికి వందనం నగదును అర్హులైన విద్యార్థులందరికీ అందించకుండా నిబంధనల పేరుతో కోతపెట్టడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...అడ్డగోలు నిబంధనలతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఆదాయపరిమితిని సడలించి గ్రామాల్లో రూ.2.5లక్షలు, పట్టణాల్లో 3లక్షలలోపు ఆదాయం ఉన్న కుటుంబాలన్నింటికీ తల్లికి వందనం వర్తింపజేయాలన్నారు. ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు అయ్యేవారికి నగదు చెల్లించాలని కోరారు. స్కీమ్ వర్కర్లు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విధించిన షరతులను నాడు విమర్శించిన కూటమినేతలు నేడు అంతకుమించి షరతులు పెట్టి లబ్ధిదారులతో పాటు నగదును తగ్గించడం సరికాదన్నారు. పిల్లవాడికి 15వేలు నేరుగా తల్లులకు చెల్లిస్తామని చెప్పి, ప్రస్తుతం రూ.2వేలు కోతవిధించారన్నారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా ఇస్తామని చెప్పి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతున్న కుటుంబంలోని విద్యార్థులకు పథకం నుంచి మినహాయించడం హామీ ఉల్లంఘనే అన్నారు. ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎవరికీ ఇవ్వకుండానే తల్లికి వందనం కోత విధించడం అన్యాయమన్నారు. విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న వారి తల్లులకు కాకుండా నేరుగా స్కూల్స్ మేనేజ్‌మెంట్‌ల ఖాతాలకు చెల్లించడంలో ఉద్దేశం ఏంటని ప్రశ్నించారు. గ్రామ,వార్డు సచివాలయాల్లో వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి అర్హులందరికీ పథకం అమలుచేయాలని డిమాండ్ చేశారు.

ఏడాదిలోనే చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డిసాహెబ్

మదనపల్లె రూరల్ : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక కూటమిప్రభుత్వం ఏడాదిలోనే చేతులు ఎత్తేసిందని కాంగ్రెస్‌పార్టీ నాయకులు రెడ్డిసాహెబ్ విమర్శించారు. శనివారం స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కూటమిప్రభుత్వం ఏడాది పాలనలో రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీలను అమలుచేయలేదన్నారు. సంక్షేమ పథకాలను అమలుచేయకపోగా, ఇచ్చినటువంటి తల్లికి వందనం పథకంలో రూ.2వేలు కోతపెట్టడం దుర్మార్గమన్నారు. మదనపల్లె మెడికల్ కాలేజీ, మదనపల్లె జిల్లా, బీటీ యూనివర్శిటీ, కడప-బెంగళూరు వయా మదనపల్లె రైల్వే లైను ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా...ఇప్పటివరకు కూటమిప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలుచేయలేక పోతోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ పథకాల ఊసే లేదన్నారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు.

యోగాతో అందరికీ సంపూర్ణ ఆరోగ్యం


మదనపల్లెలో యోగా చేస్తున్న విద్యార్థులు


కలకడ : యోగా చేస్తున్న అధికారులు, సిబ్బంది


బసినికొండ జెడ్పీహైస్కూల్‌లో ఆసనాలు వేస్తున్న దృశ్యం

మదనపల్లె రూరల్ : యోగతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని డీఎల్‌డీఓ లక్ష్మీపతి పేర్కొన్నారు. జూన్21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలరోజులపాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని సచివాయాల పరిధిలో యోగాసనాలు వేయించారు. బసినికొండ సచివాలయపరిధిలో జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో డీఎల్‌డీఓ లక్ష్మీపతి, తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ తాజ్ మస్రూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...యోగా మన ప్రాచీన సంస్కృతి, యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రస్తుత బిజీ షెడ్యూల్‌లో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదన్నారు. అందువల్ల చిన్న వయస్సులోనే మధుమేహం, దృష్టిలోపం వస్తున్నాయని, దీనివల్ల మన శరీరంలో వ్యాధినిరోధక శక్తి తగ్గిపోతోందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటారని, అలసట ఉండదని తెలిపారు. యోగాసనాలు వేయడంలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బసినికొండ వైస్ సర్పంచ్ బావాజాన్, సచివాలయ సెక్రటరీ రమణ, స్కూల్‌కమిటీ చైర్మన్ నందినితాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనంద జీవితానికి యోగా అవసరం

మదనపల్లె సిటీ : ఆనంద జీవితానికి యోగా అవసరమని యోగా మాస్టర్ డాక్టర్ అనంత లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా పిల్లల నుంచి పెద్దల వరకు యోగాను ఆచరించాలన్నారు. మొదట యోగా ప్రార్థనతో ప్రారంభించి, వివిధ రకాల యోగసనాలు చేయించి, యోగా శాంతిమంత్రతో ముగించారు. అనంతరం దివ్యాంగులు యోగసాలతో నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు మునిగోపాలకృష్ణ, బీటీ కాలేజీ కరస్పాడెంట్ వై.ఎస్.మునిరత్నం, బొమ్మనచెరువు మెడికల్ ఆఫీసర్ మహమ్మద్, వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కలకడ : ప్రతి రోజు విధిగా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం సాధ్యమని తహసీల్దార్ మహేశ్వరిభాయ్, ఎంపీడీఓ అబ్దుల్‌రహీం అన్నారు. శనివారం కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2వ శనివారం అయినా యోగా చేయించారు. ఆసనాలు వేయించి ప్రయోజనాలను తెలియజేశారు. శరీర ఆకృతి, నరాల సమస్యలు, శ్వాస వంటివాటి గురించి తెలిపారు. యోగా చేసే విధానం, అనుసరించాల్సిన పద్ధతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని సచివాలయాల సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం శబరి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ సభ్యుడైన ధనుంజయ కుమార్తె హెత్విక పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. అదే విధంగా బెంగళూరులోని వైదేహీ ఆసుపత్రిలో ఓ చిన్నారికి రక్తం అత్యవసరం కాగా అశోక్ అనే ఫౌండేషన్ సభ్యుడు ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేసినట్లు రాజశేఖర్ పేర్కొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మదనపల్లె సిటీ : స్థానిక సొసైటీ కాలనీలోని లయన్స్ కంటి ఆస్పత్రిలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ బోడిపాటి భాస్కర్‌నాయుడు తెలిపారు. ఆస్పత్రినందు కంటి వైద్య నిపుణులు డాక్టర్ నివేదిత కంటి సంబంధించి పరీక్షిస్తారన్నారు. అలాగే కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ తేజస్విని కూడా హాజరుకానున్నట్లు తెలిపారు. రోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువైద్యశాల ఏడీఏ బదిలీ

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం ప్రాంతీయ పశువైద్యశాల ఏడీఏ డాక్టర్ ఎస్.నీరజ మదనపల్లి పశువైద్యశాల సహాయ సంచాలకులుగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మదనపల్లి పశువైద్యశాల ఏడీఏ డాక్టర్ పి.విశ్వేశ్వరరెడ్డిని బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో చింతపర్తి పశువైద్యాధికారిగా పని చేసిన అనుభవంతో మండలంలో పాడిరైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే మండలంలోని నగిరిమడుగు పశువైద్యాధికారి డా.చరిత వెలిగల్లుకు, అంగళ్ళు నుంచి నగిరిమడుగు పశువైద్యాధికారిగా డా.జి.సౌజన్య, గండబోయనపల్లి పశువైద్యాధికారిగా డా.జి.అనూష్, చింతపర్తి పశువైద్యాధికారిగా డా. ఇ.సుధీర్‌రెడ్డి బదిలీపై వచ్చారు.

వీరభద్రుడి పట్టు వస్త్రాల వేలం

రాయచోటి టౌన్: రాయచోటి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన వస్త్రాలు (చీరలు, పంచెలు) వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వస్త్రాలతో పాటు భక్తులు వితరణ చేసిన బియ్యం, వట్టి కొబ్బరి కూడా వేలం వేస్తామని తెలిపారు. ఈ వేలం పాట ఈ నెల 18వ తేది బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో హిందువులు మాత్రమే పాల్గొనాలని తెలిపారు.

ఆపరేషన్ కగార్ పేరిట నరమేధం

రాయచోటి టౌన్: దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత కోసం కేంద్ర ప్రభుత్వం అపరేషన్ కగార్ పేరుతో నరమేధాన్ని సృష్టిస్తోందని, ఈ హత్యలను ప్రజాస్వామికవాదులు ఖండించాలని ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న మారణ కాండను ఆపాలని, మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కొద్దిమంది కార్పొరేట్లకు దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అనేక మందిని చంపుతోందని ఆరోపించారు. మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణం కల్పించడానికి కేంద్రం చొరవ చూపాలన్నారు.

చర్చలు జరపాలి

అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌కు పాల్పడుతోందని పౌర హక్కుల సంఘ జిల్లా కార్యదర్శి ఆర్. రవిశంకర్ తెలిపారు. హింసకు హింస సమాధానంకాదని, ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులతోపాటు అమాయక గిరిజనులను కూడా కాల్చి చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశ పౌరులే సామాజిక సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టారని, వాటిని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సింది పోయి వారిపై దాడులకు దిగడం సరికాదని ఆయన హితవు పలికారు. మావోయిస్ట్ పార్టీతో చర్చలు జరపాలని కోరారు.